ఐక్య ఉపాధ్యాయ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

సంపుటి - 2 సంచిక - 12 కృష్ణా/విజయవాడ డిసెంబర్ - 2021 పేజీలు -28 రూ.15.00

ఫ్యాప్టో ఆధ్వర్యంలో పిడిఎఫ్, స్వతంత్ర ఎమ్మెల్సీల నిరసన దీక్ష

ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఎమ్మెల్సీల నిరసన దీక్ష దృశ్యాలు

ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు

ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులు రెడ్డి

ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి

ఎమ్మెల్సీ పి.రఘువర్మ

అభివాదం

బండి శ్రీనివాసరావు - ఏపి ఐకాస చైర్మన్

బొప్పరాజు - ఏపి ఐకాస అమరావతి చైర్మన్

పాల్గొన్న ఉపాధ్యాయులు

ఐక్యఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

సంపాదక వర్గం

టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు

సంపాదకులు

సంపాదకవర్గ సభ్యులు

కె.ఎస్.ఎస్.ప్రసాద్

నక్కా వెంకటేశ్వర్లు

ఎం.వెంకటేశ్వర రెడ్డి

కె.భగీరథీ

ఈ సంచికలో...

జాతీయం-అంతర్జాతీయం	- 4
రైతాంగం నడిపిన ప్రజా ఉద్యమం	- 5
ఆదర్శనేత చెన్నుపాటి లక్ష్మయ్య	- 7
ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులు	- 9
నూతన విద్యా విధానం - 2020	- 11
ప్రాతినిధ్యాలు	- 13
ఫోటో ఫ్రేమ్ (కథ)	- 14
ప్రశ్నోత్తరాలు	- 15
సదస్సులు - సమావేశాలు	- 17
మండల శాఖల మహాసభలు	- 19
ప్రభుత్వ ఉత్తర్వులు	- 21

దశాబ్దిచందా :	1250-00
5 సం॥ చందా :	650-00
2 సం॥ చందా :	275-00
సం॥ చందా :	150-00
విడిప్రతి :	15-00

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBIN0534641

ఐక్యఉపాధ్యాయ

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com

ఉద్యోగులు ప్రజలలో భాగం కాదా?

అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న మన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. పదే పదే 27% ఐ.ఆర్. ఇచ్చామని చెప్పకుంటున్న పాలకులు మిగిలిన సమస్యల పట్ల నోరు మెదపటం లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ రద్దు చేస్తామని, సకాలంలో డిఏలు, పిఆర్‌సి ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జులై 2018 నుండి అమలు కావలసిన పిఆర్‌సికి సంబంధించి రిపోర్టు వచ్చి సంవత్సరం దాటినా నేటికీ ఆ రిపోర్టును సైతం బయట పెట్టకపోవడం పాలకుల వైఖరికి నిదర్శనం. పిఆర్‌సి రిపోర్టును ఇంతకాలం బయటపెట్టకుండా గడిపిన ప్రభుత్వంగా ఈ రాష్ట్ర చరిత్రలో రికార్డులకెక్కింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన ఇచ్చిన హామీ గురించి మాట్లాడటం లేదు. ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకపోగా సమస్యలే లేనట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం ఆక్షేపణీయం. కనీసం పిలిచి చర్చించాలనే ప్రజాస్వామిక సూత్రాలకు తిలోదకాలు ఇచ్చింది.

సమస్యలు పరిష్కరించకపోగా రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉద్యోగులను కించపరిచేవిగా ఉన్నాయి. జీతాలు ఆలస్యమైనా ఉద్యోగులు బాధపడటం లేదని, 10% ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం ప్రాధాన్యత కాదన్నట్లుగా ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాము. ఒకటవ తేదీ జీతం తీసుకొనటం ఉద్యోగి హక్కు. దానికోసం జరిగిన పోరాటాల చరిత్ర మంత్రిగారికి తెలియకపోవచ్చు. ఇది ఉద్యోగుల జీవన సమస్య మాత్రమే కాదు ఆత్మగౌరవ సమస్య కూడా. పేద ప్రజల కష్టాలను పట్టించుకోవద్దని, వారి సంక్షేమాన్ని చూడొద్దని ఎవరూ అనటం లేదు. ఈ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆ మాత్రం సామాజిక బాధ్యత ఉండటం వలనే కరోనా సమయంలో సగం జీతం ఇచ్చినా సహకరించారు. రెండున్నరేళ్ళుగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోయినా వేచిచూసే ధోరణి అవలంబించారు. డిఏలు సకాలంలో ఇవ్వకపోయినా, గతంలో ఎన్నడూ లేని విధంగా 5 డిఏలు పెండింగ్‌లో పెట్టినా సహించారు. కాని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా 10% మంది మాత్రమే అనే రీతిలో మాట్లాడుతున్న అమాత్యులవారి వ్యాఖ్యలు సహించలేరు.

అధికారంలోకి రాకముందు వచ్చిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పుడు వీళ్ళు 10%మందే అని గుర్తులేదా. ఉద్యోగుల సమస్యల గురించి నిర్దిష్టమైన సమాధానం చెప్పకుండా ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నామని ప్రకటిస్తూ పై విధంగా వ్యాఖ్యలు చేయడం నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించినట్లుగా ఉంది.

ప్రభుత్వం యొక్క ఈ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలి. సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

జెఏసి ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. ఫ్యాప్టో ఆధ్వర్యంలో పిడిఎఫ్, స్వతంత్ర ఎమ్మెల్సీలు నిరసన దీక్ష చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందికపోతే ఉద్యోగుల పోరు కొనసాగక తప్పదు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సమాజంలో భాగమని వారి సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని పాలకులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో గమనించాలి.

PRINTED AND PUBLISHED BY **POKKIREDDI BABU REDDY**, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. **EDITOR : T.S.L.N.MALLESWRA RAO.**

జాతీయం అంతర్జాతీయం

కేంద్రంతో చర్చించేందుకు కమిటీ ఏర్పాటు: రాకేష్ తికాయిత్

వ్యవసాయ చట్టాల రద్దు తర్వాత.. అన్నదాతలు చేస్తున్న డిమాండ్లపై చర్చించేందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చర్చలకు ఆహ్వానించినట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేత రాకేష్ తికాయిత్ తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రంతో చర్చించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. సాగు చట్టాల రద్దు రైతుల విజయమని తికాయిత్ అన్నారు. ఈ కమిటీ కేంద్రంతో చర్చలు జరుపుతుందని, ఒక వేళ చర్చలు సఫలీకృతమైతే.. ఉద్యమాన్ని ఆపేస్తామని తెలిపారు.. కనీస మద్దతు ధర, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేత, ఢిల్లీ శివార్లలో చేపట్టిన ఉద్యమంలో అశువులు బాసిన 702 మంది అన్నదాతల కుటుంబాలకు పరిహారం అందించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని అన్నారు.

హనీట్రాప్‌లో సైనికాధికారులు... అలెర్ట్ చేసిన ఐటిబిపి

ఢిల్లీకి చెందిన మహిళా న్యాయవాది విసిరిన వలపుల వల (హనీట్రాప్)లో దేశంలోని పలువురు సైనాధికారులు చిక్కుకున్నారని కేంద్ర ఇంటెలిజెన్స్ వెల్లడించింది. ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) విభాగం సదరు మహిళకు దూరంగా ఉండాలని భద్రతా అధికారులను హెచ్చరిస్తూ మెమొరాండం జారీ చేసింది.

హొండూరస్‌లో లెఫ్ట్ జయకేతనం

హొండూరస్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయబావుటా ఎగురవేసింది. ఈ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి జియోమారా కాస్ట్రో ఘన విజయం సాధించారు. వామపక్ష లిబ్రే (స్వేచ్ఛ) పార్టీ - లిబర్టీ అండ్ రీ ఫౌండేషన్ పార్టీ (లిబ్రే) గెలుపుతో పాలక పార్టీ ఓటమిని అంగీకరించింది.

రూ.900 కోట్ల క్రిప్టో కరెన్సీ హ్యాక్

బ్లాక్ చెయిన్ టెక్నలాజీతో వస్తోన్న క్రిప్టో కరెన్సీలు అత్యంత సురక్షితమని ఆ వర్గాలు చెబుతోంటే.. మరోవైపు ఈ కరెన్సీలో అతిపెద్ద హ్యాంకింగ్ చోటు చేసు కుంది. దీంతో ఈ డిజిటల్ కరెన్సీ భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. బ్లాక్‌చైయిన్ టెక్నాలజీ సంస్థ బాడ్జర్ డిఎఒపై హ్యాకర్లు దాడి చేసి 120 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.900 కోట్లు) కొల్లగొట్టారు. పటిష్టమైన భద్రతా వ్యవస్థగా చెప్పుకుంటున్న బ్లాక్‌చైయిన్ టెక్నాలజీలోనూ హ్యాకర్లు చొర బడటంతో క్రిప్టో కరెన్సీ పరిశ్రమ భద్రతపై వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది.

గుజరాత్ అల్లర్ల సమయంలో అధికారంలో ఉన్న పార్టీ? సిబిఎస్‌సి సోషియాలజీ పరీక్షల్లో ప్రశ్న

డిసెంబర్ నెల 1న జరిగిన సిబిఎస్‌ఈ టర్మ్-1 సోషియాలజీ పరీక్షల్లో వచ్చిన ఒక ప్రశ్న వివాదాస్పదంగా మారింది. ఫిబ్రవరి 2002లో ముస్లింలకు వ్యతిరేకంగా గుజరాత్ అల్లర్లు ఏ పార్టీ అధికారంలో ఉండగా జరిగాయి? అని ప్రశ్నపై దేశవ్యాప్తంగా అనేక విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రశ్నకు. ఎ.కాంగ్రెస్ బి.బిజెపి సి.డెమొక్రాటిక్ డి.రిపబ్లికన్..అనే ఆప్షన్లు ఇచ్చారు.

ఎస్.పి.మనోహర్ కుమార్
రాష్ట్ర కార్యదర్శి

ఇలాంటి ప్రశ్న, అందునా ప్రధాని మోడీ ఆరోపణలు ఎదుర్కొన్న గుజరాత్ అల్లర్లపై ప్రశ్న రావటం చర్చనీయాంశమైంది. ప్రస్తుత దేశ ప్రధాని నరేంద్రమోడీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మత ఘర్షణల అంశంపై సీబీఎస్‌ఈ పరీక్షలో ప్రశ్న రావటం అందర్నీ ఆశ్చర్యపర్చింది. బాధ్యులైనవారిపై కఠిన చర్య తీసుకుంటామని సీబీఎస్‌ఈ ఉన్నతాధికారులు తెలిపారు.

దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమ్మె జయప్రదం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా డిశంబర్ 2 మరియు 3 తేదీల్లో నిర్మాణ కార్మికులు సమ్మె నిర్వహించారు. సిఐటియు అనుబంధ సంస్థ అయిన భారత నిర్మాణ కార్మికుల సమాఖ్య (సిడబ్ల్యుఎఫ్ఐ) ఆధ్వర్యంలో 10లక్షల మందికి పైగా కార్మికులు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేశారు

ఐఎంఎఫ్ గీతా గోపీనాథ్‌కు రే అత్యున్నత పదవి...!

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఉన్నత స్థాయి చీఫ్ ఎకనామిస్ట్, భారత సంతతి మహిళ గీతా గోపీనాథ్ వచ్చే నెలలో ఉన్నత పదవిని అధిరోహించనున్నారు. ఐఎంఎఫ్‌లో రెండవ అత్యంత కీలక పదవైన డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సంస్థ గురువారం వెల్లడించింది. ప్రస్తుతం ఐఎంఎఫ్ చీఫ్‌గా క్రిస్టాలినా జార్జివా వ్యవహరిస్తున్నారు. దీంతో ఐఎంఎఫ్‌లో తొలిసారిగా ఇద్దరు నారీమణులు ఐఎంఎఫ్ ఉన్నత స్థాయి పదవుల్లో కొనసాగనున్నారు. గీతా ప్రస్తుత బాధ్యతలను 2018 నుండి నిర్వహిస్తున్నారు. ఆమె భారత్‌లో జన్మించినప్పటికీ.. యుఎస్ పౌరురాలు కూడా.

ప్రైవేటీరణ బలిపీఠంపై సిఇఎల్ సంస్థ

జాతీయాస్తులన్నింటినీ చవకగా విక్రయించడానికి మోడీ ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా తాజాగా ఘజియాబాద్‌లోని సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (సిఇఎల్) తెరపైకి వచ్చింది. దేశంలోని లేబరేటరీలు, ఆర్ అండ్ డి సంస్థలు వృద్ధిచేసే దేశీయ సాంకేతికతలను వాణిజ్యపరంగా ఉపయోగించుకునే లక్ష్యంతో 1974లో ఏర్పడిన సిఇఎల్‌లో ప్రస్తుతం 1500మందికి పైగా కార్మికులు వున్నారు. సౌర విద్యుత్, రైల్వే సిగలింగ్, రక్షణ ఎలక్ట్రానిక్స్, సమగ్ర భద్రత, నిఘా వంటి ప్రధానమైన నాలుగు రంగాల్లో ఇది పనిచేస్తోంది. క్షిపణి వ్యవస్థల్లో ఉపయోగించే ఫేజ్ కంట్రోల్ మాడ్యూల్ (పిసిఎం) వంటి అధునాతన ఉత్పత్తులను రూపొందించింది. భారతదేశ భద్రతలో ఈ సంస్థకు వ్యూహాత్మక ప్రాముఖ్యత వుంది. సౌర విద్యుత్‌ను పెంపొందించాలని మాట్లాడే మోడీ ఇప్పుడు లాభాలు ఆర్జించే ప్రభుత్వరంగ సంస్థను, సౌర విద్యుత్ తయారీలో పేరొందిన సిఇఎల్‌ను విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. స్వతంత్ర అంచనాల ప్రకారం ఈ సంస్థ విలువ రూ.957కోట్లు వుండగా, కేవలం రూ.210కోట్లకు సిఇఎల్‌ను అమ్మకానికి పెట్టడాన్ని సంయుక్త కర్మచారి సంఘటన్ (సిఇఎల్‌లోని అన్ని కార్మిక సంఘాల సంయుక్త వేదిక) తీవ్రంగా నిరసించింది.

రైతాంగం (మట్టి మనుషులు) నడిపిన ప్రజా ఉద్యమం

రైతాంగ పోరాటం ..యావత్ ప్రజానీకం సంఘీభావం ...దేశ ఆహార భద్రత కోసం... మరో స్వతంత్ర పోరాటం.. కార్పోరేట్ లకు వ్యతిరేకంగా ప్రపంచీకరణ తిప్పికొట్టే పోరాటం సాగిన.... సాగుతున్న.. తీరు నేటి ప్రజానీకానికి ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఇదే తీరున పోరు సాగి రైతాంగ పోరాటం 'మార్పుకి "నాంది కావాలని, అందరికీ సమాన అవకాశాలు ఇచ్చే ప్రభుత్వం రావాలని, కోరుకునే ప్రజాతంత్ర వాదులకు రీచార్జ్ అయిన ఉద్యమం. శత్రు దేశాల వారు వస్తే నిలువరించడానికి వాడే అన్ని రకాల నిర్బంధాలను రైతు ఉద్యమం మీద ప్రయోగించినా, ఎన్ని ఆటంకాలు కల్పించినా, భయపడకుండా మట్టి మనుషుల ఉక్కు సంకల్పం ముందు తుక్కు తుక్కు ఐపోయాయి.దేశ కేంద్రం సరిహద్దుల వద్ద 36 వేల కిలోమీటర్ల మేర, రోడ్లమీద వందలాది గుడారాలను నిర్మించుకుని ,దేశ ప్రజల ఆహార భద్రత కోసం, గిట్టుబాటు ధర కోసం పోరాటం సాగిన తీరు కార్పొరేట్ల వెన్నులో చలి పుట్టించింది. శాంతియుతంగా 365 రోజులకు పైగా చలిలో వణుకుతూ, ఎండకు ఎండుతూ ,అనారోగ్యానికి గురి అయినా, సహచర రైతులు 700కు పైగా ప్రాణాలు కోల్పోయినా.. **"పోరాడి తీరుతాం... సాధించి తీరుతాం"** అని దేశ ప్రజలందరి చేత నినదించిన ఉద్యమం. తాత్కాలికంగా అయినా ప్రభుత్వం దిగి వచ్చిన ఉద్యమం. ఇది రైతులు నడిపిన ప్రజా ఉద్యమం.

ఎన్.వెంకటేశ్వర్లు
యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు

చట్టాలలో ఏముంది...ఏమి జరుగుతుంది

2020 జూన్ 3 కేంద్ర కేబినెట్ వ్యవసాయ రంగంలో సంస్కరణలు పేరుతో మూడు ఆర్డినెన్స్ లను తీసుకు వచ్చింది. నవంబర్‌లో ఈ ఆర్డినెన్స్‌లను చట్ట రూపంలోకి తీసు కొచ్చింది. ఈ మూడు చట్టాలు .... వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం వాణిజ్య ప్రోత్సాహం చట్టం 2020;

రైతాంగ సాధికారత మరియు భద్రత వ్యవసాయ సేవలు చట్టం; నిత్యావసర వస్తువుల సవరణ చట్ట; వీటిలో మొదటి చట్టం వ్యవసాయ మార్కెట్ ను సరళీకృతం చేస్తాయి .మార్కెట్ కమిటీలు రద్దు అవుతాయి. మార్కెట్ కమిటీలు అంతర్థానం అయిన తర్వాత రైతుల అనివార్యంగా కార్పొరేట్ల మీద, వారి దళారుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది. కనీస మద్దతు ధర ఉండదు. రైతు ధర కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోలేడు అనివార్యంగా పంట కార్పొరేట్లకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి ..రెండో చట్టంలో కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించడం . రైతు ఏమి పండించాలో హక్కు ఉండదు. కనుక కార్పొరేట్లకు ఏమి లాభం వస్తే ఆ పంటే వ్యవసాయ క్షేత్రాలలో పండించాల్సి వస్తుంది. దీనివల్ల దేశీయ ఆహార పంటల కంటే, విదేశాల్లో లేదా కార్పొరేట్లకు లాభాలు వచ్చే పంటలు పండించడం వల్ల ఆహార భద్రత సంక్షోభానికి గురవుతుంది. మూడో చట్టం నిత్యావసర సరుకుల సవరణ చట్టం. ప్రభుత్వం ఇప్పటివరకు ఎఫ్సీఐ గోడౌన్ల ల ద్వారా రైతులు ఉత్పత్తి చేసిన పంటలను కొనుగోలు చేసి, నిల్వ చేస్తుంది .దేశంలో ఉన్న పేద ప్రజానీకానికి సబ్సిడీల పేరుతో తక్కువ ధరకు సరఫరా చేస్తుంది. భవిష్యత్తులో నిత్యావసర సరుకులు నిల్వ చేసుకునే సామర్థ్యానికి మినహాయింపు లేదు .ఎంతైనా నిల్వలు ఉండొచ్చు. కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముకోవడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుంది .కార్పొరేట్ వ్యవసాయం రంగంలోకి వచ్చిన తర్వాత సాగు కష్టమై చిన్న, మధ్య తరగతి రైతులు వ్యవసాయ నుండి దూరమై, భూముల అమ్మకం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ఇది వ్యవసాయ రంగంలో పెట్టుబడి, భూమి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడానికి దారి తీస్తుంది .తాజా చట్టాలతో ప్రభుత్వ పాత్రను పూర్తిగా తొలగించి కార్పొరేట్ల దయాదాక్షిణ్యాల కు భారత వ్యవసాయ రంగాన్ని వదిలిపెడతారు. దీనివల్ల దేశ ప్రజల ఆహార భద్రత ప్రశ్నార్థకం అవుతుంది.

పోరు జరిగిన తీరు....

20 20 నవంబర్ 25న పంజాబ్ నుండి భారతీయ కిసాన్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన రైతాంగ మార్చ్, నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ఢిల్లీ సరిహద్దుల వరకు సాగింది. ఈ రైతాంగానికి ఆల్ ఇండియా కిసాన్ సభ, స్వరాజ్ ఇండియా ఇతర 400 సంఘాలు తోడయ్యాయి .రైతు సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా గా ఏర్పడ్డాయి. వేలాది మంది రైతులు ట్రాక్టర్, ట్రాలీ లు ,ఎడ్ల బండ్లు ద్వారా ఢిల్లీ సరిహద్దు లోకి ప్రవేశించారు .దీన్ని అడ్డుకోవటానికి ఢిల్లీలోని బహిరంగ మైదానానికి రైతులంతా చేరుకుంటే చర్చలు జరుపుతామని ప్రభుత్వం రాయబారం పంపింది .కానీ రైతులు దీన్ని తిరస్కరించారు. ఢిల్లీ, హర్యానా సరిహద్దులో సింఘు,టిక్రీ, ఖాజీపూర్ ప్రాంతాలలో తాముతీసుకు వచ్చిన ట్రాక్టర్,ట్రాలీ లనే నివాసాలుగా మార్చుకుని ఎంతకాలమైనా, ఎన్ని రోజులైనా దేశ ఆహార భద్రతకు హాని కలిగించే చట్టాలను రద్దు చేసే దాకా ఉద్యమం కొనసాగుతుందని రైతులు ప్రకటించారు . చట్టాన్ని వెనక్కి తీసుకోము అని చెప్పటం, ఈ ఉద్యమంకి కులాన్ని, మతాన్ని అంటగట్టడం, మీడియా ద్వారా విషప్రచారాన్ని ప్రచారం చేయటం , రైతుల మీద దాడులు చేయటం, వారు వేసుకున్న టెంట్‌లకు విద్యుత్తుని కట్ చేయడం, నీటి సరఫరా బంద్ చేయుట... ఇలాంటి చర్యలు అన్నింటిని దేశ ప్రజానీకం గమనించారు. అందుకనే ఒక్క రైతులే కాదు మిగిలిన ప్రజానీకం కూడా ఈ చట్టాలను వెనక్కి తీసుకోవాలని పోరాటానికి సంఘీభావం ప్రదర్శించారు. పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

పోరాటం ప్రత్యేకత

ఇది రైతులకే పరిమితమైన ఉద్యమం మాత్రమే కాదు. అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించిన పోరుబాట.

పంజాబ్ ప్రజలు ఉద్యమం చేస్తున్న వారికి సామూహిక లంగర్స్ (భోజన శాలలు) ఏర్పాటు చేసి పోరాటం చేస్తున్న రైతులతో పాటు, వారి కుటుంబానికి, పోరాటానికి మద్దతుగా వచ్చిన ప్రజానీకానికి కూడా భోజనం ఏర్పాటు చేశారు. భోజనానికి కావాల్సిన సరుకులు, కూరగాయలు వివిధ రాష్ట్రాల నుంచి ఉచితంగా సేకరణ చేశారు.

నివాసాలుగా ట్రాక్టర్స్, ట్రాలీ లు, టార్పాలిన్ పట్టాలు, అక్కడక్కడ వెదురు కర్రలతో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నివాసాలన్నీ రోడ్డుపై ఏర్పాటు చేసుకొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు లు స్థానికంగా డాక్టర్స్, నర్సులు షిఫ్ట్ పద్ధతిలో రైతుల ఆరోగ్య పరిరక్షణ చేసారు. తెలుగు రాష్ట్రాల నుంచి డాక్టర్స్, మెడికల్ రిప్స్, ఆశా వర్కర్స్, అంగన్వాడీ కార్యకర్తలు మెడికల్ క్యాంప్ కి సహకారం అందించారు. తెలంగాణ లోని సుశ్రీత నర్సింగ్ హోమ్ డాక్టర్ మదుసుధనరెడ్డి ,వారి సిబ్బంది ప్రత్యేక మెడికల్ సేవలు చేశారు. ఢిల్లీ ప్రభుత్వం, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు, వివిధ రాష్ట్రాల డాక్టర్స్, నర్సింగ్ సిబ్బంది రైతులకు సేవ చేశారు.

- రైతులు పోరాటం లో ఉంటే వారిపిల్లలకు చదువు ఇబ్బంది కలగకుండా స్థానిక ఉపాధ్యాయులు ఆన్లైన్, ఆఫ్ లైన్ ద్వారా చదువు చెప్పారు. అలాగే పోరాటంలో పాల్గొన్న రైతులలో చదువుకున్న వారు కూడా పిల్లలకు విద్య నేర్పారు.
- సోషల్ మీడియా లో రైతు పోరాటాన్ని వక్రీకరించడాన్ని గమనించి, ప్రత్యామ్నాయ మీడియాను ఏర్పాటు చేసుకొని, వందలాది యూట్యూబ్ చానల్స్ని ఏర్పాటు చేసుకొన్నారు. "ప్రభుత్వ మీడియా వద్దు...ప్రజల మీడియా కావాలి" అని మీడియా లో వాస్తవాలు ప్రచారం చేశారు.
- ప్రభుత్వం విధించిన 144 సెక్షన్ కి ప్రత్యామ్నాయం గా 288 సెక్షన్ ఏర్పాటు చేసుకొన్నారు. దీని అర్థం" మా నిరసన ప్రాంతంలోకి పోలీసులకు ప్రవేశం లేదు" అని.
- మమ్ములను హిందూ, ముస్లిం లుగా విభజన చేయాలని ప్రభుత్వం చూసింది. మేము భారతీయులం.. మేమంతా ఒకటే అని చాటిచెప్పారు.
- టెక్నాలజి రైతులు అలవాటు పడాలని ప్రభుత్వం చెబుతుంది... నిజమే కానీ...రోటీ లను గూగుల్ నుంచి డౌన్లోడ్ చేసుకోలేము అని ఖరాకండిగా చెప్పారు.
- అప్పులో పుట్టాము, అప్పులతో చచ్చిపోము. పోరాడి మేము, మాతోపాటు దేశ ప్రజలందరినీ రక్షించుకొంటాము అని చాటి చెప్పిన పోరు బాట .ఇది రైతుల పోరాటం మాత్రమే, అదీ ఒకటి రెండు రాష్ట్రాలకు పరిమితమైన అనవసర పోరాటం అని ప్రభుత్వం చెబితే, ఇది ప్రజా పోరాటం దేశప్రజలందరి భాగస్వామ్యం తో ఉద్యమం ఉవ్వెత్తున ఎలా నడిచిందో చూశాక, ప్రభుత్వం చెప్పే మాటలు రైతుల పొలికేక ముందు గాలిలో తేలిపోయాయి.

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య మృతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళ నాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య డిసెంబర్ 4న మరణించారు. రోశయ్య గుంటూరు జిల్లా వేమూరులో 1933 జులై 4న జన్మించారు. వార్డు సభ్యునిగా, శాసన మండలి సభ్యునిగా, శాసన సభ్యునిగా, మంత్రిగగా, పార్లమెంట్ సభ్యునిగా, ముఖ్యమంత్రిగా, గవర్నరుగా వివిధ పదవులను సమర్ధవంతంగా నిర్వహించారు. వరుసగా ఏడుసార్లు మొత్తం 16సార్లు బడ్జెట్ ప్రవేశెట్టిన ఆర్థిక మంత్రిగా రికార్డులకెక్కారు. అత్యంత రాజనీతిజ్ఞునిగా పేరు పొందిన రోశయ్య మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంతాపం తెలియజేస్తోంది.

ఏమిసాధించింది

స్వాతంత్ర ఉద్యమం తరువాత మరో స్వాతంత్ర చారిత్రాత్మక పోరాటం. రాజకీయనేపద్యాలను పక్కన పెట్టి సంఘటితంగా కదిలిన ఉద్యమం. కార్మిక, కర్షక ఐక్యతను చాటిన ఉద్యమం. ప్రజలకు వాస్తవాలు తెలిస్తే. మనోభావాల పేర మోసం చేయడం సాధ్యం కాదని నిరూపించిన పోరాటం. ఎంతవారైనా ప్రజా పోరాటాలకు తలవంచక తప్పదని చెప్పిన పోరు యుద్ధం.

ప్రస్తుతం జరుగుతున్న ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాలకు ఊపు నిస్తుంది. విద్యుత్ రంగ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్ర తరం చేయాలని తెలుపుతుంది.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుని తిరిగి నినాదంగా మార్చడమే కాదు ప్రభుత్వరంగంలోనే వుండేటట్లు కాపాడుకోవాలి. పట్టణ ప్రాంతాలలో ఆస్థి విలువ ఆధారంగా పన్నువేసే పద్ధతికి స్వస్థి చెప్పే దానికోసం సిద్ధపడాలి.

విద్యారంగంలో ప్రాథమిక పాఠశాల వ్యవస్థను రక్షించుకోవడానికి చేసే పోరాటంకి మార్గదర్శి. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించడానికి రైతాంగ పోరాటం లాగా సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు వారి కుటుంబాలను ఉద్యమంలోకి తీసుకురావల్సిన స్థితిని చూపుతుంది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం అని మరోసారి నిరూపించిన ఉద్యమం.

ప్రపంచీకరణ కు ఎదురు నిలిచింది. బరిగీచి ఎవరో తేల్చు కొందాం రమ్మని తొడ కొట్టింది. ఎదురు లేదని, ఇష్టారాజ్యంగా ఏదయినా చేయవచ్చని అనుకొనే కార్పొరేట్ లకు తల దాచుకోవ దానికి భవిష్యత్లో అవకాశం ఉండదని హెచ్చరించింది. చరిత్రను సృష్టించేది ప్రభువులు కాదని, చరిత్రను ప్రజలే నిర్మిస్తారని తత్వవేత్త చెప్పిన మాట ఈ తరానికి చెప్పిన రైతాంగం నడిపిన ప్రజాపోరాటం.

ఆదర్శనేత చెన్నుపాటి లక్ష్మయ్య

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడుగా పేరుగాంచిన అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య మరణించి 53 సంllలు గతించాయి. అయినా ఆయన స్ఫూర్తి నేటికీ ఉపాధ్యాయ ఉద్యమాన్ని నడిపిస్తూనే ఉంది. ఉపాధ్యాయులకు సంఘం పెట్టుకొనే హక్కు సాధించారు. సంఘానికి నాయకత్వం వహించి చాలీచాలని జీతాలతో సతమతమయ్యే ఉపాధ్యాయులకు టైమ్ స్కేళ్ళు, పెన్షను సౌకర్యం వంటి అనేక సౌకర్యాలు సాధించిన ఉపాధ్యాయ బంధువు ఆయన.

భారతదేశ స్వాతంత్ర్యం కోసం విప్లవ మార్గాన్ని ఎంచుకొని ఆ పోరాటంలో మన ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్ విప్లవకారుల గురించి చెబుతూ "ఆశయ సాధన కోసం తుపాకి గుండుకు బలికావడమో, ఉరికొయ్యకు శిరస్సును అర్పించడమో గొప్ప త్యాగంగా భావించవచ్చు. అలా చేసిన వారిని ప్రజలు వీరులుగా ఆరాధించవచ్చు. కానీ నమ్మిన ఆశయం కోసం జీవితం చివరి క్షణం వరకూ ఎలాంటి బలహీనతలకూ లోనుకాకుండా నిబద్ధతతో ఎవరు నిలబడతారో వారే నిజమైన విప్లవకారులు" అంటాడు. చెన్నుపాటి లక్ష్మయ్య గారు ఆ కోవకు చెందిన నాయకుడు కష్టాలకు జంకిపోకుండా నమ్మిన విశ్వాసాన్ని తుదిశ్వాస వరకు ఆచరించి చూపిన ఘనచరిత్ర చెన్నుపాటిది. ఆయన జీవితాన్ని గూర్చి చెప్పడమంటే ఆ కాలం నాటి ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రను చెప్పడమే.

జి. ప్రభాకర వర్మ
UTF రాష్ట్ర కార్యదర్శి

గుంటూరు జిల్లా నరసరావుపేట తాలుకా వేలూరు గ్రామంలో పేద రైతు కుటుంబంలో జన్మించిన లక్ష్మయ్య గారు స్వగ్రామంలోనే జిల్లా బోర్డు ప్రాథమికోపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించారు. ఆనాటికి జిల్లా బోర్డు ప్రాథమికోపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించారు. ఆనాటికి జిల్లా బోర్డు ఉపాధ్యాయ సంఘం నామమాత్రంగా అధికారుల జేబు సంస్థగా ఉండేది. 1942లో దానిలో బాధ్యతాయుత స్థానం స్వీకరించి బలోపేతం చేయడానికి గట్టి కృషి చేసారు. ఒకే రకమైన సమస్యలతో ఇబ్బందులుపడే ఉపాధ్యాయులు వివిధ సంఘాలుగా చీలి ఉండడం ఉద్యమ వ్యాప్తికి ఆటంకం అని గ్రహించి ఐక్య ఉద్యమ నిర్మాణానికి నడుంకట్టారు. 1946లో రాష్ట్ర స్థాయిలో వివిధ సంఘాల కార్యకర్తల సమావేశం గుంటూరులో ఏర్పాటు చేసి వివిధ మేనేజిమెంట్లు క్రిందనున్న ప్రాథమికోపాధ్యాయులందరినీ ఒకే సంఘంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 1947లో రాష్ట్ర మహాసభ జరగడం దానిలో ఆంధ్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడడం, దానికి లక్ష్మయ్య గారు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చరిత్రలో చిరస్మరణీయ ఘట్టాలు. సంఘవాణిగా "ఉపాధ్యాయ" పత్రికను ప్రారంభించి ప్రధాన సంపాదకుడుగా ఉంటూ దానిని ఉపాధ్యాయ వాణిగా, ఉద్యమ ప్రతిబింబంగా తీర్చిదిద్దారు.

ఉపాధ్యాయులు ఐక్యం కావడాన్ని, ఉద్యమబాటలో నడవడాన్ని సహించలేని ప్రభుత్వం, నిరంకుశ అధికారులు ఉపాధ్యాయులకు సంఘ స్వాతంత్ర్యం లేదని ఓ విపరీత ఉత్తర్వు జారీ చేసారు. దాన్ని ప్రతిఘటించి హైకోర్టు వరకు వెళ్ళి సంఘ స్వాతంత్ర్య నిషేధపుటుత్తర్వు రద్దు చేయించారు లక్ష్మయ్య గారు. ఫెడరేషన్ నాయకుడుగా సంఘానికి దిశానిర్దేశం చేసిన విధానం, వ్యక్తిగత జీవితంలో ఆయన పాటించిన విలువలూ నేటితరం కార్యకర్తలకు ఎన్నో పాఠాలు నేర్పిస్తాయి.

ఫెడరేషన్ పాలసీ స్టేట్‌మెంట్‌లో విద్యావిధానం జయప్రదం కావడానికి "ప్రభుత్వము, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజలు కలిసి విధానాలు రూపొందించుకొని అమలుకు పూనుకోవాలని, అందరికీ కలుపుకొని పోయేందుకు ఫెడరేషన్ ప్రతినిదులు కృషిసాగిస్తారని" వివరించబడింది. ప్రభుత్వాల పట్ల సంఘం అనుసరించ వలసిన వైఖరిని సూచిస్తూ అందులోనే "ప్రభుత్వ పక్ష రాజకీయ ఎట్టివైనను ఉపాధ్యాయ ఉద్యమానికి సంబంధంలేదు. ఆ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల, ఉపాధ్యాయ ఉద్యమం పట్ల, విద్యా సంస్కరణల పట్ల అనుసరించే వైఖరులను బట్టే దాని మంచి చెడ్డలు నిర్ణయిస్తాము" అని పేర్కొనబడింది. ఉద్యమాలకు సాధారణ ప్రజానీకం సహకారం పొందవలసిన అవసరాన్ని గుర్తిస్తూ లక్ష్మయ్య గారి నాయకత్వంలోని రాష్ట్ర ఫెడరేషన్ "ప్రజల సహకారాన్ని సంపాదించుటకు ఉపాధ్యాయ వర్కర్లు తీవ్ర కృషి చేయాలని, ప్రజలకు వారి బిడ్డలకు వారి అనుదిన జీవితంలో ఏ మాత్రం పనికిరాని విద్యావిధానం అమలు చేయడంతో ఉపాధ్యాయులు ప్రజల నుండి పూర్తిగా వేరు చేయడ్డారని, ప్రజా సమస్యల గాలి కూడా సోకకుండా నిబంధనలు తయారు చేయబడుటతో ఉపాధ్యాయులు ప్రజలతో కలసిపోయే అవకాశం లేకుండా పోయిందని, ప్రజల, ఉపాధ్యాయుల ఐక్య ఆందోళన ప్రభుతాన్ని దారిలో పెట్టగలదని, ఈ విషయం వివరించి ప్రజలను కలుపుకొని రావాలని కార్యకర్తలకు ఆదేశమిచ్చింది.

ఉపాధ్యాయ ఉద్యమంలో పత్రిక ప్రాధాన్యతను, అవసరాన్ని లక్ష్మయ్య గారు ఈ విధంగా వివరించారు. "ఉపాధ్యాయ సమస్యల

కొరకు, విద్యావిధాన మార్పుల కొరకు ఎడతెగని కృషిసాగించే సాధనం ఉపాధ్యాయ పత్రిక. ప్రతి సమస్యను వివరంగా విద్యావేత్తల, ప్రజల, ప్రభుత్వం ముందుంచి పత్రిక తోడ్పడుతుంది. సమస్యల పరిష్కార మార్గంలో విద్యామార్పులు సూచించడంలో చుక్కాని లాగా ఉపాధ్యాయులకు ఉపయోగపడుతుంది. ఉత్తేజపరచి ఉద్యమ నిర్మాణానికి సన్నద్ధం చేస్తుంది. విజ్ఞానాభివృద్ధికి ఉపయోగ పడుతుంది.”

ఉద్యమనేతగా సంఘ నిర్మాణం లోను, వ్యక్తిగత నడవడికలోనూ ఉన్నత విలువలను లక్ష్మయ్య గారు పాటించారు. 1942లో హయ్యర్ గ్రేడ్ ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి సంఘ నాయకుడిగా వివిధ సమస్యలపై జిల్లా అధికారులను నిలదీసినప్పుడు వారు ఆగ్రహించి, సస్పెండ్ చేస్తామని, డిస్మస్ చేస్తామని కన్నెర్రజేసినా అదరని, బెదరని ధైర్యశాలి లక్ష్మయ్య. 16 సం॥ల సర్వీసును ఉద్యమం కొరకు త్యాజించి, పూర్తికాలం కార్యకర్తగా పనిచేసిన త్యాగశీలి. కార్యకర్తలను గుర్తించడంలో, వారిని అభివృద్ధి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. రాష్ట్రమంతటా పర్యటిస్తూ, యువకులైన ఉపాధ్యాయులను చేరదీసి వారికి తగిన శిక్షణ ఇచ్చి, వారిని క్రమశిక్షణ, అంకితభావం గల కార్యకర్తలుగా అభవృద్ధి పరచేవారు. కార్యకర్తల ఇళ్ళకు వెళ్ళినప్పుడు కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలుకరించి, కుటుంబ పరిస్థితులను, ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని సమస్యలుంటే పరిష్కార మార్గాలను చూపి ఆదుకొనేవారు. లక్ష్మయ్య గారు నిరాడంబరుడు, పొదుపరి. ఆర్థిక క్రమశిక్షణ పాటించారు. శాసనమండలి సభ్యుడిగా తనకు వచ్చే జీతాన్ని, అలవెన్సులనూ సంఘ నిధికే జమకట్టేవారు. అత్యవసరమైన ఖర్చులకు సంఘం నుండి వాడుకొనే వారు. ఎప్పటికప్పుడు జమా ఖర్చులు చెప్తూ ఆడిట్ చేయిస్తూ ఆర్థిక విషయాలలో నిక్కచ్చిగా ఉండేవారు. శాసన మండలి సభ్యుడిగా తన పదవీకాలం ముగిసిన తర్వాత చేసిన ఒక ప్రకటనలో లక్ష్మయ్యగారు “నాకు వేరే ఆస్తిపాస్తులు ఏమీ లేవు. ఉపాధ్యాయ ఉద్యమమే నా ఆస్తి. గత 20 సం॥లుగా నాకున్న ఆస్తి అదే. దానితోనే శాసనమండలి ఎన్నికలకు వచ్చాను. మీరు ఆదరించి సభ్యత్వం ఇచ్చారు. ఈ ఆరు సంవత్సరాల తర్వాత నాకు మిగిలిన ఆస్తి కూడా అదే, ఉపాధ్యాయ ఉద్యమమే” అని చెప్పారు. ఉపాధ్యాయ ఉద్యమమే జీవితంగా లక్ష్మయ్య గారు ఎలా పని చేసిందీ ఈ ప్రకటన తెలియజేస్తుంది. చెన్నుపాటి చూపించిన మార్గంలో నడుస్తూ, ఆయన పాటించిన విలువల్ని అనుసరిస్తూ పనిచేయడమే ప్రస్తుత తరం కార్యకర్తలు చేయవలసిన పని. ☯

సూచనలు - సలహాలు

2022 యుటియఫ్ డైరీ ముద్రణకు సిద్ధమవుతోంది. డైరీలో మార్పులు, చేర్పులకు సంబంధించిన సూచనలు, సలహాలు పంపించవలసిందిగా కోరుతున్నాము.

- ప్రచురణల కమిటీ

సమాజం కోసం సాహిత్యం

సమాజాభ్యున్నతి కోసం సాహిత్యం సృష్టించాలని, వెర్రితలలు చేస్తున్న విష సంస్కృతి స్థానంలో ప్రత్యామ్నాయ సంస్కృతిని ముందుకు తీసుకుపోవాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. ఐక్యఉపాధ్యాయ పూర్వ ప్రధానసంపాదకులు కొమ్మారెడ్డి కేశవ రెడ్డి ప్రథమ స్మారక సాహితీ అవార్డు ప్రదానోత్సవ సభ నవంబర్ 28న బాలోత్సవ భవన్‌లో జరిగింది. యుటియఫ్, సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు యుటియఫ్ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చి సాహితీరంగంలో కృషి చేసిన కేశవరెడ్డి అందరికీ ఆదర్శమని చెప్పారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు బోధిస్తూనే సమాజ గమనాన్ని పరిశీలించడం నేర్చుకొన్న సామాజిక, సాహితీవేత్త కేశవరెడ్డి అని కొనియాడారు. చరిత్ర, విద్య అంశాలలో వాస్తవ విషయాలను ప్రజలకు చేరువ చేసే విధంగా సాంస్కృతిక రంగం కృషి చేయాలని కోరారు. ఏ కాలంలోనైనా పాలకవర్గ ప్రయోజనాలే విద్యా విధానంలో ఉంటాయని చెప్పారు. వాటిని విశ్లేషించి ప్రజలందరికీ విద్యను అందించడానికి కృషి చేయాలని తెలిపారు. విద్యారంగంలో ప్రస్తుతం వస్తున్న మార్పులు కొద్దిమందికి మాత్రమే చదువుకొనే అవకాశం ఇస్తుందన్నారు. ఇది మధ్య యుగాలనాటి పరిస్థితులకు దారితీస్తాయని చెప్పారు. అమ్మ అనే మాటే అనిర్వచనీయమైందని, దీనిని కించపరిచే సంస్కృతి సమాజంలో ఉంటే భవిష్యత్ తరాలకు ఎలాంటి సందేశం ఇస్తామని ఆవేదన వ్యక్తం చేసారు.

ప్రముఖ అభ్యుదయ రచయిత, అనువాదకులు రావెల సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్చిన బాట వల్లే అభ్యుదయం వైపు వెళ్లాలని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం, సృజనాత్మకతలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అది ఉపాధ్యాయులకే సాధ్యమని తెలిపారు.

ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐక్యఉపాధ్యాయ పత్రిక పాఠకుల మన్ననలు పొందడానికి కేశవరెడ్డి చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ఉద్యోగ విరమణ తరువాత కూడా ఆయన 25 ప్రామాణిక గ్రంధాలలోని 10వేల ఇంగ్లీష్ పేజీలను తెలుగులోకి అనువదించారని తెలిపారు. అనంతరం సాంబశివరావుకు సాహితీ అవార్డును తెలకపల్లి ప్రదానం చేసారు. సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ వందన సమర్పణ చేసిన ఈ సభలో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.కుసుమకుమారి, చైల్డ్‌లేబర్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.ఆంజనేయరెడ్డి, కేవశరెడ్డి కుటుంబ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, శివన్నారాయణ, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎ.కృష్ణసుందరరావు, ఎస్.పి.మనోహర్‌కుమార్, ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ☯



ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులు
అసర్ రిపోర్టు 2021

మన భారతీయ సమాజం విద్యారంగంలో పురోగమనంలో ఉందా లేదా తిరోగ మనంలో ఉందా లేదా స్తబ్దతలో ఉన్నదా అనేది నిర్ధారించేందుకు సామాజిక శాస్త్రాలు, రాజకీయ, అర్ధశాస్త్రాలు కొన్ని ప్రమాణాలు, ప్రాతిపదికలు, గణాంకాలు సూచికలను తయారు చేస్తాయి. ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు ఎన్ని అతిశయోక్తులు చెప్పినా, ఈ ప్రమాణాలు, ప్రాతిపదికలు ,గణాంకాలు శాస్త్రీయంగా హేతుబద్ధంగా ఆ సమాజ స్థితిని నిర్ధారిస్తాయి. నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ 'ప్రథమ్' సంస్థ1995 నుంచి దేశంలో విద్యారంగాన్ని ప్రతి సంవత్సరం విశ్లేషణ చేయడం దేశ మరియు రాష్ట్రాల విద్యాస్థాయిని తెలియజెప్పడం గొప్ప అంశంగా చెప్పవచ్చు. ప్రభుత్వ నివేదికలు మరియు ఇలాంటి సంస్థల నివేదికలను తులనాత్మక అధ్యయనం చేసినప్పుడు మనం విద్యారంగంలో ఏ స్థితిలో ఉన్నామో తెలుస్తుంది. ప్రభుత్వాల విధానం,ఉపాధ్యాయుల వైఖరి, సమాజవైఖరి, విద్యార్థుల వైఖరి అనే నాలుగు అంశాల విశాల చట్రంలో మాత్రమే విద్యారంగ స్థితిని వీలైనంత సమగ్రంగా అధ్యయనం చేయడం జరుగుతుంది. దానికి దగ్గరగా ప్రథమ్ సంస్థ నివేదిక విశ్లేషణ ఉన్నాయని మనం భావించవచ్చు.

ఎస్.పి.మనోహర్ కుమార్
రాష్ట్ర కార్యదర్శి

ప్రతి సంవత్సరలానే నవంబర్ 17వ తేదీన యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (అసర్ రిపోర్ట్) పదహారో వార్షిక నివేదిక విడుదలయ్యింది. 'ఈ నివేదికలో పిల్లల ఎన్‌రోల్‌మెంట్, పెయిడ్ ట్యూషన్ క్లాసెస్, స్మార్ట్‌ఫోన్ అందుబాటు, లెర్నింగ్ సపోర్ట్ ఎట్ హోమ్, యాక్సెస్ అండ్ ఎవైలబులిటీ ఆఫ్ లెర్నింగ్ మెటీరియల్, మరియు కోవిడ్ కాలంలో పాఠశాలల్లో బోధనాభ్యసనం అనే అంశాలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈసారి సర్వే ఫోన్ ద్వారా నిర్వహించారు. ప్రధానంగా రూరల్ ఏరియాల్లో సర్వే నిర్వహించబడింది.

దేశంలోని 25 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 581 జిల్లాల్లో,17,184 గ్రామాల్లోని 76,076 గృహాలను, 5 నుంచి 16 సంవత్సరాల పిల్లలు 75,234 మందితో సర్వే నిర్వహించ బడింది. సర్వే నిర్వహించేనాటికి 4,872 తెరిచిన పాఠశాలల్లో, అలాగే 2,427 కరోనా కారణంగా మూసివేసిన పాఠశాల్లో సర్వే చేసారు.

దేశ వ్యాప్తంగా కరోనా కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు కాని విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ లోని 390 గ్రామాల్లో 2,367 కుటుంబాలు, 1,507 మంది విద్యార్థులు సర్వేలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో 223 మంది 1, 2 తరగతుల వారు, 375 మంది 3-5 తరగతులు, 421 మంది 6-7 తరగతులు, 304 మంది 8-10 తరగతుల వారున్నారు. విద్యార్థుల నమోదు, ట్యూషన్, స్మార్ట్ ఫోన్లు, విద్యలో కుటుంబ సభ్యుల సహకారం, అందుబాటులో మెటీరియల్ తదితర అంశాలపై ఈ సర్వే ద్వారా వివరాలు సేకరించారు.

దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 2018లో 64.3 శాతం విద్యార్థులు చేరగా, 2021లో 70.3 శాతం విద్యార్థులు చేరారు. ఆంధ్రప్రదేశ్‌లో 2018లో 62.2 శాతం (65.1 శాతం బాలికలు, 59 శాతం బాలురు), 2020లో 69.9 శాతం (69.5 శాతం బాలికలు, 64.4 శాతం బాలురు) నమోదైంది. 2021లో 70.6 శాతం (బాలికలు 77.2 శాతం, 63.7 శాతం బాలురు) విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. మూడేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల నమోదు శాతం ఐదుకు పైగా పెరిగింది. 2018లో కంటే 2021లో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య జాతీయ సగటు (6.1 శాతం) కంటే 8.4 శాతం ఎక్కువ.

దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ట్యూషన్‌కు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇది 2018లో 28.6 శాతమైతే 2021లో 39.2 శాతానికి చేరింది. ట్యూషన్లకు వెళ్లే వారిలో బాలురే ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ట్యూషన్‌కు వెళ్తున్న వారి సంఖ్య 2018లో 14.7 శాతం ఉండగా, 2021లో 22.7 శాతానికి పెరిగింది.

దేశ వ్యాప్తంగా 2018లో 36.5 శాతం (29.6 శాతం ప్రభుత్వ, 49.9 శాతం ప్రైవేటు పాఠశాలలు) విద్యార్థులకు ఇంటి వద్ద స్మార్ట్ ఫోన్ అందుబాటులో ఉంది. 2021 నాటికి ఆ సంఖ్య 67.6 శాతానికి (63.7 శాతం ప్రభుత్వ, 79 శాతం ప్రైవేటు విద్యార్థులు) చేరింది.

ఆంధ్రప్రదేశ్‌లో 2018లో 42.1 శాతం విద్యార్థులకు ఇంటి వద్ద స్మార్ట్ ఫోన్ అందుబాటులో ఉండగా.. 2020లో 61.5 శాతం, 2021లో 72.3 శాతానికి పెరిగింది. వివిధ కారణాల వల్ల 18.6 శాతం మంది స్మార్ట్ ఫోను వినియోగించుకోలేకపోతున్నారు.

దేశ వ్యాప్తంగా 66.6 శాతం మంది విద్యార్థులకు.. ఆంధ్రప్రదేశ్ లో 62 శాతం మంది విద్యార్థులకు కుటుంబ సభ్యులు చదువులో

సహకరిస్తున్నారు. పాఠ్య పుస్తకాల కోసం పేరు నమోదు చేసుకున్న వారు దేశ వ్యాప్తంగా 91.9 శాతం మంది విద్యార్థులు.. ఆంధ్రప్రదేశ్‌లో 96.3 శాతం మంది విద్యార్థులు ఉన్నారు.

కానీ దేశం మొత్తం మీద 2018 లో బడిలో నమోదు కానీ విద్యార్థుల శాతం 2.5గా ఉంటే 2020 మరియు 2021లలో 4.6శాతంగా ఉంది. అంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగినప్పటికీ ఇంకా బడిలో నమోదు కానీ విద్యార్థుల సంఖ్య తగ్గలేదని అర్థం అవుతుంది. అన్ని వయసుల విద్యార్థులు మరియు అన్ని తరగతుల్లోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల్లో నమోదు పెరిగింది. రాష్ట్రాల వారీ గా చూస్తే అత్యధికంగా ఉత్తరప్రదేశ్ లో 13.2శాతం, తరువాత స్థానంలో కేరళ 11.9శాతం,తమిళనాడు 9.6శాతం రాజస్థాన్ 9.4, మహారాష్ట్ర 9.2 ఆంధ్రప్రదేశ్‌లో 8.4 శాతం పెరుగుదల ఉంది.అత్యల్పంగా 2.5శాతమే పెరుగుదల ఉన్న రాష్ట్రంగా జార్ఖండ్ ఉంది.కానీ ఈశాన్య రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు తగ్గడంతో పాటు బడిలో నమోదు చేసుకోని చిన్నారుల సంఖ్య పెరగడం జరిగింది.

కరోనా కాలంలో భారతదేశంలో 2020 మార్చి నుంచి సెప్టెంబర్ 2020 వరకూ చూస్తే సుమారు 73 వారాల కాలం పాఠశాలలు మూసివేసి ఉన్నాయి.ఈ కాలంలో విద్యార్థులలో లెర్నింగ్ లాస్ అదేవిధంగా హయ్యర్ రేట్ ఆఫ్ డ్రాపౌట్స్ ఉంటారని అంచనా. కానీ స్మార్ట్ ఫోన్, విద్య విషయంలో పిల్లలకు కుటుంబసభ్యుల తోడ్పాటు వంటి అంశాలు విద్యాభ్యసనకార్యక్రమం సక్రమంగా నడవడానికి ఉపయోగపడ్డాయని సర్వే ద్వారా తెలుస్తుంది. కరోనా కాలంలో కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మారిపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన జెవికె కిట్లు, అమ్మఒడి వంటి వివిధ ప్రోత్సహకాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేదానికి తల్లిదండ్రులను ఆకర్షించాయని చెప్పవచ్చు. వివిధకారణాలతో ప్రభుత్వ పాఠశాలలో ఎన్నడూ లేనట్లుగా విద్యార్థులు ప్రైవేటుపాఠశాలలనుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం జరిగింది.

పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం జరగకపోగా, పనిచేస్తున్న ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు వినియోగించడం వలన ఉపాధ్యాయుల బోధనా సమయం హరించివేయబడుతుంది.

2019లో జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక త్వరలో మెగా డీఎస్సీ ఉంటుందని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పలుసార్లు ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలలో తమ పార్టీ అధికారంలోకి వస్తే పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రతిపక్ష నేత హోదాలో జగన్ కూడా హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వం ఏర్పడి విలువైన సగభాగం గడిచిపోయింది. కానీ జగన్ వాగ్దానం చేసిన ఉపాధ్యాయ ఖాళీల భర్తీ హామీ మరుగున పడింది. ఆ మధ్య డీఎస్సీకి ముందు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నిర్వహిస్తామని సిలబస్ ను కూడా ప్రభుత్వం ప్రకటించింది. నెలలు గడిచిపోతున్నా కనీసం టెట్ షెడ్యూలు కూడా ఇవ్వలేదు.

సినీ గేయ రచయిత సిరివెన్నెల మృతి

మూడున్నర దశాబ్దాలుగా 2400పైగా పాటలు రాసిన ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నల సీతారామ శాస్త్రి ఊపిరితిత్తుల కేన్సర్ సంబంధిత వ్యాధితో నవంబర్ 30న మరణించారు. ఆయన వ్రాసిన చిత్రం పేరు ఆయన ఇంటి పేరుగా మారింది. 1955 మే 20న జన్మించారు. గేయాలతోపాటు పలు కథలను వ్రాసారు. నటునిగా కూడా రాణించారు. 11 నంది అవార్డులు అందుకున్న ఏకైక తెలుగు సినీ గేయా రచయిత. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆయన సీతారామ శాస్త్రి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంతాపం వ్యక్తం చేస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలలలో నూతన విద్యార్థుల చేరిక బాగా పెరిగింది. కానీ ఏం లాభం? అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని చందంగా ప్రభుత్వం పాఠశాల విద్యపై చేసిన కృషి మొత్తం బూడిదలో పోసిన పన్నీరే అవుతోంది. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా పాఠాలు బోధించడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇటు విద్యార్థులలోనూ అటు తల్లిదండ్రులలోనూ నిట్టూర్పులు మొదలవుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగినంతగా ఉపాధ్యాయులు లేక ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న టీచర్లు అన్ని తరగతులకు పాఠాలు చెబుతూ లెక్కలేనన్ని యాప్‌ల భారాన్ని మోయాల్సి రావటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన కుంటుపడింది. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఎన్నికలకు ముందు వేసిన డియస్సీని, తెలుగుదేశం ప్రభుత్వం నియామకాలు పూర్తిచేసింది. అనంతరం అయిదేళ్ళకాలంలో 2018లో చివరిసారిగా డీఎస్సీని 7500 పోస్టులతో చంద్రబాబు నాయుడు నిర్వహించడం జరిగింది. ఈ నోటిఫికేషన్ ను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో నియామకాలు పూర్తిచేసింది. ఇంకా కొన్ని కేడర్ల నియామకాలు కోర్టుకేసులతో ముడిపడి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సంఖ్యలో దాదాపు 25 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు అధికారిక లెక్కలే చెపుతున్నాయి. మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు ప్రతిసంవత్సరం నిర్వహిస్తామన్న డియస్సీ ఏది? రుణం కోసం ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకోవడం వల్ల బ్యాంకు షరతులలో ఉపాధ్యాయ నియామకాలపై నిషేధం ముఖ్యమైనదని, అందువల్లే డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపలేదని భావించవచ్చా? ఎన్నికల సభలలో హామీ ఇచ్చినట్లు జగన్ ప్రభుత్వం మెగా డీఎస్సీ ఎందుకు నిర్వహించాలని ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేదానికి చిత్తశుద్ధితో కృషిచేయాలని కోరుచున్నాం.

నూతన విద్యా విధానం - 2020 పూర్వ ప్రాథమిక విద్య(ECCE)

సి.వి. కృష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక

నూతన విద్యా విధానం 2020లో పూర్వ ప్రాథమిక విద్యను గురించి ఏమి చెప్పారు?

1. మారుతున్న కాలమాన పరిస్థితులకు తగినట్లు 3,4,5 సంవత్సరాల పిల్లలందరికీ నాణ్యమైన సంరక్షణతోపాటు విద్య కూడా అందించాలి.
2. ఈ పిల్లలకు ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో కేంద్ర విద్యా శాఖ NCERTI ఆధ్వర్యంలో NCPF అనే సంస్థ పాఠ్య ప్రణాళికను రూపొందిస్తుంది. 3,4,5 సంవత్సరాల బిడ్డలతో పాటు 0-3 సంవత్సరాల పిల్లలకు 1,2 తరగతుల పిల్లలకు కూడా కావలసిన సిలబస్‌ను రూపొందిస్తుంది.
3. ఈ పాఠ్య ప్రణాళిక సరళంగా దశలవారీగా కృత్యాధారంగా ఉండాలి. అన్వేషణాత్మకంగా ఉండాలి. అక్షరాలు అంకెలు, రంగులు, రూపాలు, ఆటలు, ఫజిల్స్ తదితరాలతోపాటు హేతుబద్ధంగా ఆలోచించడం, సమస్యా సాధన, రంగులు వేయడం, చిత్రకళ, చేతి పనులు ఇందులో భాగాలు. మంచి వ్యక్తిత్వం, స్పందన, ప్రేమ, సౌహార్ధం, పరిశుభ్రత, టీమ్ వర్క్ ఈ దశలో అలవడాలి. భౌతిక, జ్ఞాన, భావపరమైన అంశాలతో పాటు, భాష, అక్షరాలు, అంకెలు కూడా నేర్చు కోవాలి. ఈ విషయాలన్నీ అంతర్జాతీయ అనుభవాల ఆధారంగా ఉంటాయి. స్థానిక, భారతీయ సంప్రదాయాలకు, కళలకు, గేయాలకు కథలకు ఇందులో ప్రాధాన్యత ఉ ంటుంది.

ఈ పిల్లలంతా ఎక్కడ ఉంటారు?

1. ప్రస్తుతం ప్రత్యేకంగా ఉన్న అంగన్వాడీలు.
2. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో ఉన్న లేదా అనుసంధానం చేయబోతున్న అంగన్వాడీలు.
3. 5 సం॥ల పిల్లల్ని కూడా చేర్చుకొనే ప్రాథమిక పాఠశాలలు
4. కేవలం పూర్వ ప్రాథమిక పాఠశాలలు
5. గిరిజన ఆశ్రమ పాఠశాలలు

ఇందులో 5వ సంవత్సరం పిల్లల్ని సన్నద్ధతా తరగతి అంటారు.

సంరక్షకులు లేదా టీచర్లు ఎవరు?

ప్రస్తుతం అంగన్వాడీల్లో 10వ తరగతి లేదా ఇంటర్ విద్యార్హ తులున్న వారికి 6 నెలలు డిజిటల్ శిక్షణ ఉంటుంది. అంతకంటే తక్కువ విద్యార్హతలున్న వారికి ఒక సంవత్సరం డిప్లోమా కోర్సు ఉ ంటుంది.

ఈ శిశు విద్యను అమలు పరిచేది ఎవరు?

విద్యాశాఖ, మాతా శిశు సంక్షేమ శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ.

ఈ కార్యక్రమం మొత్తం 2030 సంవత్సరానికి పూర్తి కావాలి. ఇదీ స్థూలంగా నూతన విద్యా విధానంలో పూర్వ ప్రాథమిక విద్యను గురించిన ప్రణాళిక.

శిశు విద్య గురించి అభివృద్ధి చెందిన దేశాలు ఏమి చెబుతున్నాయి?

విద్యారంగంలో ప్రపంచానికి ఆదర్శంగా ఉన్న ఏ దేశాల్లోనూ శిశు విద్య తప్పనిసరిగాదు. పిల్లల తల్లిదండ్రుల ఇష్టాన్నిబట్టి ఉంటుంది. శిశు కేంద్రాలకు రోజూ రానవసరం లేదు. చాలా దేశాల్లో 6 సంవత్సరాలలోపు పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్చుకోరు. 1వ తరగతిలో 7వ సంవత్సరం వస్తేనే చేర్చుకొంటారు. శిశు కేంద్రాలలో తప్పనిసరి పాఠ్యప్రణాళికలంటూ ఉండవు.

ఈ దశలో పిల్లల ఎదుగుదల చాలా కీలకమైనదిగా భావి స్తారు. ఈ దశలో ఆరోగ్యం, ఆహారం ప్రధానం. స్వేచ్ఛగా ప్రకృతిలో పరిసరాలలో తల్లిదండ్రులతో కలిసి జీవించడం కీలకంగా భావిస్తారు. కొన్ని దేశాలలో పిల్లలతో గడపడానికి తల్లిదండ్రులకు జీతంతో కూడిన దీర్ఘకాలిక సెలవులు కూడా ఇస్తారు.

వికాసం అనేది నాలుగు గోడల మధ్య జరగదు. విశాల ప్రపంచంలోనే అది జరుగుతుందని వీరి అభిప్రాయం. శిశు విహార, శిశు వికాస కేంద్రాలే తప్ప శిశు విద్యా కేంద్రాల్ని వీళ్లు అంగీకరించరు.

మనం నర్సరీ ఎల్‌కేజీ, యుకేజీలనే పేర్లను అరవు తెచ్చుకొని కేజీలకొద్దీ పుస్తకాల బరువును వారి వీపులమీద బెట్టి మోయి స్తున్నాము. ఎల్‌కేజీ అంటే లోయర్ కిండర్ గార్డెన్ - అంటే పిల్లల తోట అని అర్థం. ఇక్కడ తోట లేదు పూలు లేవు చివరకు గడ్డిపరక కూడా ఉండదు. నాలుగు సిమెంటు గోడల మధ్య పిల్లలు నలిగిపోతూ ఉంటారు.

పసి వయస్సులో ఏమీ నేర్చుకోకూడదా?

నేర్చుకోవచ్చు. వారికి వాళ్లు నేర్చుకోవచ్చు. అలా నేర్చుకోడానికి అనువైన వసతులు కల్పించడమే పెద్దవాళ్ల పని. ప్రకృతే పిల్లలు పసితనంలో వారి అనుభవాల ఆధారంగా భావి జీవితానికి అవసరమైన మెళకువలు నేర్చుకోడానికి ఏర్పాటుచేసింది. ఆ పనిలో మన జోక్యం పనికిరాదు. మనం జోక్యం చేసుకొంటే విరుద్ధమైన ఫలితాలు వస్తాయి.

ఈ సంవత్సరాలలో పిల్లలు అంకెలు అక్షరాలు అర్థం చేసుకో లేరు. ఇవి చాలా సంక్లిష్టమైన అర్థం లేని గుర్తులు – ఒకవేళ అభ్యాసంతో నేర్పించి గుర్తుపెట్టుకొనేట్లు చేసినప్పటికీ అదంతా జ్ఞానం గాబోదు. కొంతమంది తల్లిదండ్రులు 3,4,5 సంవత్సరాల పిల్లలకు దేశాలు, రాజధానులు, ఎక్కాలు, పద్యాలు నేర్పించి పదిమందిముందు తమ పిల్లల ప్రతిభను ప్రదర్శింపజేస్తుంటారు. పిల్లల్ని పొగిడి బహుమతుల ఆశలు జూపి కొంతమందికి నేర్పించవచ్చు. కొన్ని పనులు జంతువులకు, పక్షులకు కూడా నేర్పి ప్రదర్శించి చూసేవారికి వినోదం పంచుతుంటారు. పసితనంలో బాల మేధావులుగా వెలగొందినవారు ఆ తర్వాత ఏమయ్యారో ఎవ్వరికీ తెలియదు. ఆ తల్లిదండ్రులూ ఆశభంగం పొందడం, ఆ పిల్లలు కుంగిపోవడం జరుగుతుంది. మీకు తెలుసా 5,6 రెండు సంవత్సరాలు నేర్చుకొన్న విషయాలన్నీ 7వ సంవత్సరంలో రెండు మూడు నెలల్లో నేర్చుకొంటారు.

ఈ దశలో కావలసింది ఏమిటి?

3,4,5 సంవత్సరాల పిల్లలకు కావలసింది శిశు విద్యకాదు. పోషణ, సంక్షరణ, వికాసం. ఒక పువ్వు సహజంగా వికసించాలి. మొగ్గగా ఉన్నప్పుడే దాని పూరేకులు బలవంతంగా విడదీస్తే అవి రాలిపోతాయి. దాన్నే మొగ్గలోనే తుంచడం అంటారు.

శిశు విద్యా కేంద్రాలు అవసరం లేదా?

శిశు విద్యా కేంద్రాలు కాదు. శిశు వికాస కేంద్రాలు కావాలి. ఈనాడు పదిమంది పిల్లలు ఒక చోట చేరి ఆడుకొనే ప్రదేశాలు అవసరం చాలా ఉంది. పసి పిల్లలు టీవీలకు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. మానసికంగా, శారీరకంగా నష్టపోతున్నారు. గతంలో మాదిరి ఒక ఇంట్లో నలుగురైదుగురు పిల్లలుండే ఉమ్మడి కుటుంబాలు లేవు. కాబట్టి పిల్లలు కలుసుకొనే ప్రదేశాలు చాలా అవసరం. అవి గుర్తింపు పొందిన శిశు వికాస విహార కేంద్రాలైతే మంచిది.

శిశు కేంద్రాలు ఎలా ఉండాలి?

పిల్లలు అటు ఇటు తిరగడానికి పరుగెత్తడానికి వీలుగా విశాలమైన ప్రాంగణాలు కావాలి. అక్కడ పిల్లలు ఆడుకోడానికి, ఇసుక, మట్టి, నీళ్లు ఉండాలి. జారుడు, బల్లలు, ఉయ్యాలలు, ఎక్కి దిగడానికి నిచ్చెన్నలవంటి పరికరాలు వివిధ రకాల పనులు చేయడానికి చిన్న చిన్న వస్తువులు ఉండాలి.

పిల్లలు తాగడానికి మంచినీటి వసతి, మరుగుదొడ్డి వసతి పండుకొని నిద్రపోవడానికి ప్రత్యేకమైన గది ఉండాలి.

పిల్లల్ని ఆడించి పాడించి సంరక్షించడానికి, పిల్లల సైకాలజీ ఆరోగ్యాల గురించి అవగాహన ఉన్న తల్లిదండ్రులలాంటి నిపుణులు కావాలి. పిల్లలే గదా వారికి చేసేది ఏముందని తక్కువ జీతంతో సరిపుచ్చవచ్చని నైపుణ్యత లేని వర్కర్లను పెడితే జరిగే నష్టం ఊహకందనంతగా ఉంటుంది.

ఒకరి సంరక్షణ కింద 20మంది పిల్లలకు మించకూడదు. న్యాయంగా అయితే పదిమంది పిల్లలకు ఒకరుండాలి.

1966లో నేషనల్ పాలసీ ఆన్ ఎడ్యుకేషన్ కమీషన్ చైర్మన్‌గా కొఠారి గారు కేంద్రప్రభుత్వానికి అత్యుత్తమమైన సిఫారసులు చేసారు. అందులో విద్యకు బడ్జెట్‌లో 6 శాతం కేటాయించాలని చెప్పారు. కామన్ స్కూల్ కావాలన్నారు. 54 సం॥లైంది. కామన్ స్కూల్ లేదు. బడ్జెట్‌లో 6 శాతం కేటాయింపులూ జరగలేదు. ఎప్పుడూ 3.5లోపే. శిశు విద్యకు ప్రత్యేక కేటాయింపులు ఉంటాయా? అందులోనే సర్దుకోమంటారా? గత అనుభవాలు ఏమి చెబుతున్నాయో శిశు విద్య ఎంత అందంగా ఉండబోతుందో ఊహించలేమా? ☯

వాట్సాప్ ఫోటోలు పంపవద్దు

"ఐక్యఉపాధ్యాయ" కార్యక్రమాల ఫోటోలను వాట్సాప్‌లో పంపి స్తున్నారు. ఆ ఫోటోలు తక్కువ రిజల్యూషన్ ఉండటం వలన ప్రచురించడం ఇబ్బందిగా ఉంది. కావున కెమేరా ఫోటోలను మెయిల్ ద్వారా పంపగలరు. – సంపాదకవర్గం

ఐక్యఉపాధ్యాయ పత్రిక చందా రేట్లు

విడి పత్రిక	రూ.	15.00
సంవత్సరం చందా	రూ.	150.00
అర్ధ దశాబ్ది చందా (5 సం॥లు)	రూ.	650.00
దశాబ్ది చందా (10 సం॥లు)	రూ.	1250.00

ఐక్యఉపాధ్యాయలో ప్రకటన రేట్లు

4వ కవర్ పేజీ (కలర్)	రూ.	30,000.00
2,3 కవర్ పేజీ (కలర్)	రూ.	20,000.00
లోపలి పేజీ (బ్లాక్ & వైట్)	రూ.	10,000.00
॥ ఆప్షనల్	రూ	11,000.00

ప్రాతినిధ్యాలు

1. ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలి:

ఉపాధ్యాయులకు సంబంధించి ఆర్థికపరమైన అంశాలు పరిష్కరించాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శికి ప్రాతినిధ్యం చేయడమైనది. 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని, డిఎస్సి 2008 (మినిమమ్ టైం స్కేల్) ఉపాధ్యాయులకు హెడ్ ఆఫ్ ఎకౌంట్ ఇవ్వాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల రూ.398/- స్పెషల్ సర్వీస్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ అనుమతి ఇవ్వాలని, విజయవాడ మున్సిపల్ ఉపాధ్యాయులకు కోవిడ్ కారణంగా నిలుపుదల చేసిన జీతాలు ఇవ్వాలని తదితర సమస్యలపై ప్రాతినిధ్యం చేయడమైనది.

2. మెడికల్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలి

మెడికల్ బిల్లులు మంజూరై, డిస్చార్జ్ అయినట్లు చూపుతున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరు ఉత్తర్వులు ఇవ్వాలని వై.యస్.ఆర్. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ముఖ్యకార్య నిర్వహణాధికారికి ప్రాతినిధ్యం చేయడమైనది.

3. డిపార్ట్‌మెంట్ పరీక్షలు పాస్ అయిన తేదీ నుండి 12/24 సం॥ల స్కేళ్ళు ఇవ్వాలి :

ఉపాధ్యాయుల 12/24 సం॥ల సర్వీసు పూర్తిచేసి తదుపరి డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉత్తీర్ణులైనా సదరు బిల్లులకు మంజూరు చేయవద్దని డిటిఏ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసి 12/24 సం॥ల సర్వీసు పూర్తి చేసిన తేదీ నుండి స్కేళ్ళు ఇస్తూ ఆర్థిక లాభం టెస్టులు పాసైన తేదీ నుండి ఇవ్వాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి ప్రాతినిధ్యం చేయడమైనది.

4. మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి:

మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ అకౌంట్లు ప్రారంభించాలని, ఉన్నత పాఠశాలలోని ఎస్‌జిటి, పండిట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, అప్‌గ్రేడ్ అయిన యుపి పాఠశాలలకు హెచ్‌ఎం, ఎస్ఏ పోస్టులు మంజూరు చేయాలని, ప్రమోషన్ షెడ్యూలు ప్రకటించాలని, స్పెషల్ టీచర్ సర్వీస్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, జిఓ 77 అమలు చేయాలని, మంగళగిరి, తాడే పల్లి ఉపాధ్యాయుల జీతాల సమస్య, అమలాపురం, మండ పేట, చిలకలూరిపేట ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిం చాలని మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శికి ప్రాతినిధ్యం చేయడమైనది.

5. గుంటూరు జిల్లాలో పదోన్నతులలో నష్టపోయిన 1995 డిఎస్సి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలి :

గుంటూరు జిల్లాలో 2002లో జరిగిన పదోన్నతులకు మెరిట్-కం-రోస్టర్‌లో సీనియార్టీ జాబితా ప్రకారం ఇవ్వకపోవడం వలన నష్టపోయిన 1994 డిఎస్సి ఉపాధ్యాయులకు సర్వీసును కోర్టు ఉత్తర్వుల ప్రకారం నోషనల్ సీనియార్టీ ఇవ్వాలని పాఠశాల విద్య కమీషనర్‌కి ప్రాతినిధ్యం చేయడమైనది.

6. ఎం.ఏ. తెలుగు చేసినవారికి పదోన్నతులు ఇవ్వాలి



కె.ఎస్.ఎస్.ప్రసాద్
రాష్ట్ర ప్రధానకార్యదర్శి

2018 డిఎస్సి నియామకాలలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) పోస్టుకు ఎం.ఏ. తెలుగు చేసిన వారికి అవకాశం ఇవ్వాలని హైకోర్టు తీర్పు ప్రకారం పదోన్నతులలో కూడా ఎం.ఏ.(తెలుగు) చేసినవారికి స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) గా అవకాశం ఇవ్వాలని పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శికి ప్రాతినిధ్యం చేయడమైనది.

7. యాప్‌ల అప్‌లోడింగ్‌పై ప్రధానోపాధ్యాయులకు జారీచేసిన షోకాజ్ నోటీస్‌లు రద్దు చేయాలి :

జోన్-4లో గల చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలో యాప్‌లలో వివరాలు అప్‌లోడ్ చేయలేదని పలువురు ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీస్‌ను రద్దు చేయాలని కడప ప్రాంతీయ విద్యా సంచాలకులకు ప్రాతినిధ్యం చేయడమైనది.

8. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి :

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పలు సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కి ప్రాతినిధ్యం చేయడమైనది. పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు ఆర్థిక శాఖ అనుమతి తెప్పించాలని, ప్రమోషన్ షెడ్యూలు ఇవ్వాలని, భాషా వాలంటీర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ ఏ.ఎన్.ఎం.లను నియమించాలని, కోవిడ్‌తో చనిపోయిన, ఉపాధ్యాయుల కుటుంబాలకు తక్షణమే కారుణ్య నియామకాలు చేపట్టాలని, తదితర సమస్యలపై ప్రాతినిధ్యం చేయడం జరిగింది.

10. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో భాషా విద్యావాలంటీర్లను నియమించాలి :

2021-22 విద్యా సంవత్సరానికి గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 811మంది భాషా వాలంటీర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్‌కి ప్రాతినిధ్యం చేయడమైనది.

నృత్య దర్శకుడు శివశంకర్ కన్నుమూత

ప్రముఖ నృత్య దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత కె.శివశంకర్ కోవిడ్ బారినపడి నవంబర్ 28న మరణించారు. 1948 డిసెంబర్ 7న చెన్నైలో జన్మించారు. 10 భాషల్లో 800పైగా చిత్రాలకు నృత్య దర్శకుడిగా పని చేసారు. తమిళనాడు ప్రభుత్వం నుండి నాలుగుసార్లు ఉత్తమ కొరియో గ్రాఫర్‌గా అవార్డు అందుకున్నారు. 2008లో ఉత్తమ నృత్య దర్శకుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. ఆయన మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంతాపం తెలియజేస్తోంది.

ఐక్యఉపాధ్యాయ
కథలు - కవితలు పోటీలలో
ప్రచురణకు ఎంపికైన కథ

ఫోటో ఫ్రేమ్

సాంబమూర్తి లండ
అక్కుపల్లి, శ్రీకాకుళం

ఆ నిమిషం నా చేతులు వణకడం నాకు తెలుస్తూనేవుంది. నా పేరు ముందు డాక్టర్ అనే పదం చేరబోతుందన్న సంతోషం కన్నా బాబాయ్ కల నిజం చేశానన్న సంతృప్తి, నా మనసుఆకాశంలో కోటి హరివిల్లుల్ని విరబూయిస్తోంది. స్నాతకోత్సవ వేళ ఎం.డి నెఫ్రాలజీ టాపర్ గా గవర్నర్ చేతుల మీదుగా డిగ్రీ అందుకున్నాను. నన్నందరూ ఆకాశానికి ఎత్తేస్తుంటే ఐదేళ్ల క్రితం నాన్నమ్మ ఈలోకంనుండి నిష్క్రమించినప్పుడు బాబాయ్ నాతో అన్న మాటలు గుర్తొచ్చాయి.

"మనం బ్రతకడానికి ఏ పనైనా చేయొచ్చు తల్లీ. కానీ, నలుగురు బతుకు కోసం పని చేయడం కేవలం కొందరి వల్లే వీలవుతుంది. అలాంటి అరుదైన అవకాశం నలభై ఏళ్లప్పుడు హవల్దార్ గా తన విధి నిర్వహణలో మీ నాన్నకు వచ్చింది. కరుడుగట్టిన తీవ్రవాదులని తెలిసీ ఒంటరిగా ఎదురెళ్లి దేశక్షేమం కోసం వాళ్ళని మట్టుబెట్టి, ఆ ప్రయత్నంలో ప్రాణాలొదిలాడు. దేశం అంటే తల్లిలాంటిదమ్మా. తల్లిని కాపాడుకోవడానికి మీ నాన్న ప్రాణాలిచ్చేసి రుణం తీర్చుకున్నాడు. కానీ, నా ప్రాణాల్ని అడ్డుపెట్టి నా తల్లిని కాపాడుకోలేకపోయాను. కిడ్నీ మహమ్మారి మన ఊరిని శ్మశానంలా మార్చేస్తోంది. నా తల్లిలాగే ఎందరో తల్లులు మృత్యువును కళ్ళలో పెట్టుకు బతుకీడుస్తున్నారు. వ్యాధివచ్చాక ఒకటి రెండేళ్లలో చనిపోవడం తప్ప, ఏమీ చేయలేని నిస్సహాయత. మన ప్రాంతం గురించి సంపూర్ణ అవగాహన ఉన్న ఒక మంచి డాక్టర్ ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని నా నమ్మకం. ఆర్.ఎం.పీ లనూ అరకొర వైద్యాన్నీ నమ్ముకుని, పట్నానికిపోయి నాణ్యమైన వైద్య సేవలు పొందలేకా నిండు జీవితాల్ని మూడుపదుల్లోపే కోల్పోతున్నాం. మీ నాన్నకైనా నాకైనా నువ్వొక్కదానివే బిడ్డవి. నువ్వొక నెఫ్రాలజిస్టువైతే, మన ఊరి రుణమే కాదు మన ప్రాంతం రుణం తీర్చుకునే అవకాశం నీకొస్తుంది.నా కల నెరవేరుస్తావా తల్లీ!"

ఐదేళ్లలో బాబాయ్ మాటలు ఎన్నిసార్లు నా చెవుల్లో మార్మోగాయో లెక్కలేదు. నీట్ ఎగ్జామ్ లో మంచి ర్యాంకు సాధించి ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, న్యూ ఢిల్లీలో జాయిన్ అవుతున్నప్పుడు బాబాయ్ నాకో పెద్ద కవర్ లో ఒక ఫోటో ఫ్రేమ్ గిఫ్ట్ గా ఇచ్చారు. "ఇప్పుడే తెరచి చూడొద్దమ్మా,నీ రూమ్ కి వెళ్ళాక తెరువు "అన్నారు.

రూమ్ కెళ్ళి ఓపెన్ చేసేంతవరకూ ఒకటే ఉత్కంఠ. ఆ ఫోటో ఎవరిదై ఉంటుంది? నాన్నమ్మదా? నాన్నదా? గొప్ప డాక్టర్? లేదా సైంటిస్ట్ దా? తెరచి చూసాక విస్తుపోవడం నా వంతైంది. అదొక 16 ఏళ్ల అమ్మాయి ఫోటో. కాలుష్యాన్ని అరికట్టి స్వచ్ఛమైన గాలినీ, నేలనీ, అందమైన భూగోళాన్నీ మాకివ్వండని ప్రతి వీకెండ్ లో బడి ఎగ్గొట్టి, స్వీడన్ పార్లమెంట్ ముందు ప్లకార్డు పట్టుకున్న పదహారేళ్ళ పర్యావరణ కార్యకర్త 'గ్రెటా థెన్ బర్గ్' ఫోటో అది. కింద ఒకే ఒక్క వాక్యం రాశారు.

"నువ్వు మా 'గ్రెటా'వు కావాలి తల్లీ!"
ప్రేమతో... నీ బాబాయ్.

కళ్ళమ్మట నీళ్లొచ్చేశాయ్.బాబాయ్ కి పిల్లల్లేరు. మా ఇంట్లో కూడా నేనొక్కదాన్నే. అందరూ నన్ను ప్రేమగా చూసుకుంటారు. బాబాయ్ అయితే ఇక చెప్పక్కర్లేదు. ఇంటర్ హాస్టల్ లో ఉండి చదువుకోవలసి వచ్చినప్పుడు, డాడీ ని కాదని నన్ను డ్రాప్ చేయడానికి బాబాయే హాస్టల్ కొచ్చారు. అక్కడ నన్నొదిలి వెళ్లలేక ఒకటే ఏడుపు. "ఎప్పుడైనా హాస్టల్ లో జాయిన్ అయ్యేటప్పుడు పిల్లలు ఏడుస్తారు కానీ, మీరు ఏడుస్తున్నారేమిటండీ" అని మా కాలేజ్ ప్రిన్సిపాల్ ఒకటే నవ్వు! హోమ్ సిక్ సెలవుల్లో ఇంటికొచ్చినప్పుడు పిన్ని అనింది. " మీ బాబాయ్ కి ఇద్దరు పిల్లలమ్మా. మొదటి బిడ్డ కవిత్వం. రెండు బిడ్డవి నువ్వు."

బాబాయ్ కి నేనంటే చాలా ఇష్టం అనుకున్నాను. కానీ, సంక్రాంతి సెలవుల్లో బాబాయ్ రాసిన కవితలు చదివాక తెలిసింది. అసలు స్త్రీలంటేనే బాబాయ్ కి ప్రాణమని. కవితల నిండా స్త్రీ పట్ల ప్రేమ, ఆరాధన, స్త్రీ సమస్యలపట్ల అంతులేని వేదన కనిపించాయి. అదే మాటన్నాను బాబాయ్ తో. "స్త్రీ ని ఆకాశంలో సగమంటారమ్మా. నిజానికి సమస్త విశ్వమూ స్త్రీ దే తల్లీ!ఏదో ఒక రోజు ప్రతి మగవాడూ ఆ విషయాన్ని గుర్తిస్తాడు. అయినా ఒప్పుకోవడానికి స్త్రీకున్నంత ధైర్యం మగవాడికి ఉండదులేమ్మా!" అంటూ నవ్వేశారు.

×××

ట్రైన్ లో కూర్చున్నానన్న మాటే గానీ, మనసు నా వశంలో లేదు. ఆర్నెళ్ల తర్వాత బాబాయ్ ని చూడబోతున్నాను. తను కోరుకున్నట్టు డాక్టర్ ని అయ్యాను. ' ఇక హాస్పిటల్ ప్రారంభించాలి. మాప్రాంతం కిడ్నీ సమస్యల నివారణ కోసం నావంతు కృషి చేయాలి!' మరిసారి గట్టిగా అనుకున్నాను. నాకు కొత్త రెక్కలు మొలిచినట్టుంది. ట్రైన్ గంటకు 140 కిలోమీటర్లు వేగంతో వెళుతున్నా, మరో 60 కిలోమీటర్లు ఎక్కువ వేగంతో వెళ్తే బావున్ననిపిస్తోంది.

బాగ్ నుండి పుస్తకం తీసి తిరగేయడం మొదలుపెట్టాను. అయాన్ రాండ్ రాసిన 'ద ఫౌంటెన్ హెడ్' పుస్తకం అది.నా ఇరవయ్యో పుట్టినరోజుకు బాబాయ్ ఇచ్చిన ప్రెజెంటేషన్. మొదటి పేజీలో బాబాయ్ రాసిన వాక్యం దగ్గరే కళ్ళు ఆగిపోయాయి.

(తరువాయి 16వ పేజీలో)

ప్రశ్నోత్తరాలు

నిర్వహణ : టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు
ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు
Mail ID : **ikyopadhyaya1975@gmail.com**

ప్రశ్న : ఒక ఉపాధ్యాయుడు ఎస్ఏగా 18 సం॥ల ఇంక్రిమెంట్ తీసుకున్నారు. తదుపరి రెండుసార్లు ప్రధానోపాధ్యాయుని పదోన్నతి నిరాకరించారు. వీరికి 12,18 సం॥ల ఇంక్రిమెంట్లు రికవరీ చేయాలంటున్నారు. వాస్తవమేనా?

జవాబు : ఆర్థిక శాఖ సర్క్యులర్ మెమో నం.216-ఎ/2/ఎ2/ పిసి-2/2007-1, తేదీ.23.03.2007నందు The employee is eligible for continuing to hold the Special Promotion Post Scale - I in the lower category, because his relinquishment to the promotion post has prospective effect. The individual is not eligible for further S.P.P.-II Scale under automatic Advancement Scheme**గా పేర్కొనబడింది. దీనిని బట్టి పదోన్నతి నిరాకరించినా లేదా క్రింది పోస్టుకు రివర్ట్ అయినా అప్పటి వరకు తీసుకున్న ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్ళు రద్దు కావు. భవిష్యత్‌లో ఇచ్చే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్ళు మంజూరు చేయబడవు.**

ప్రశ్న : ఒక ఉద్యోగికి పై ఉన్న క్రిమినల్ కేసు కొట్టివేయబడింది. పై కోర్టులో ప్రత్యర్థులు అప్పీలు చేసారు. పెండింగ్‌లో ఉంది. సదరు ఉద్యోగికి ప్రమోషన్ ఇవ్వవచ్చునా?

జవాబు : ఇవ్వవచ్చును. జిఓ యంయస్ నం.529 జిఏడి తేదీ.19.0.2008 ప్రకారం క్రింది కోర్టులో క్రిమినల్ కేసు కొట్టివేయబడి పై కోర్టులో పెండింగ్‌లో ఉన్న అతనికి ప్రమోషన్ ఇవ్వవచ్చును.

ప్రశ్న : పదోన్నతి పొందాలంటే క్రింది కేడర్‌లో ఎంత సర్వీసు పూర్తి చేసి ఉండాలి.

జవాబు : జిఓ ఎంఎస్ నం.175 జిఏడి; తేదీ.27.11.2017 ప్రకారం పదోన్నతి పొందుటకు క్రింది కేడర్‌లో కనీసం రెండు సంవత్సరముల సర్వీసు పూర్తిచేసి ఉండాలి.

ప్రశ్న : ఇరువురు ఉపాధ్యాయుల సస్పెండ్ అయి తిరిగి విధులలో నియమించబడ్డారు. ఒకరికి క్యుములేటివ్ ఎఫెక్ట్ లేకుండా, మరొకరికి క్యుములేటివ్ ఎఫెక్ట్‌తో ఒక ఇంక్రిమెంట్ నిలుపుదల చేసారు. వారికి 12 సం॥ల స్కేలుకు సర్వీసు ఎలా లెక్కించాలి.?

జవాబు : ఆర్థికశాఖ సర్క్యులర్ నం.41082/ఎ1/పిసి-2/95; తేదీ. 30.2.1996నందు Government accordingly, clarify that the period during which the increments have been stopped without cumulative effect, will count for purpose of Automatic Advancement Scheme. In cases where the period of punishment with stoppage of increments with cumulative effect imposed shall not qualify as Service for purpose of computation of service for Automatic Advancement Scheme**గా పేర్కొన బడింది. దీని ప్రకారము క్యుములేటివ్ ఎఫెక్ట్ లేకుండా ఇంక్రిమెంట్ నిలుపుదల చేసిన కాలాన్ని 12 సం॥ల స్కేలుకు లెక్కిస్తారు. క్యుములేటివ్ ఎఫెక్ట్‌తో ఇంక్రిమెంట్ నిలుపుదల చేసిన ఉపాధ్యాయునికి ఆ కాలం 12 సం॥ల స్కేలును లెక్కించరు.**

ప్రశ్న : పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ ఎప్పుడు ఇవ్వాలి.

జవాబు : జనవరి, ఫిబ్రవరి మాసములలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వవచ్చును. జీవన్‌ప్రమాణ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇవ్వవచ్చు.

పాఠకుల అభిప్రాయాలు పంపండి

